క్లుప్తంగా

అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ జాతరలో ఆలయ కమిటీ సభ్యులతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

గరిడేపల్లి : మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో గంగమ్మ జాతరను యాదవులు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వచ్చి గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. కాగా, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జగదీష్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జాతర నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలి రామకృష్ణ, పెద్ద గొల్ల కుర్ర వెంకన్న, ఎల్లబోయిన దుర్గయ్య యాదవ్, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, మాశెట్టి శ్రీహరి, పిడమర్తి అంజి, యాదవులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి : గరిడేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అప్పన్నపేట ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున మంగళవారం ఉదయం 7: 30 గంటల నుంచి 10 గంటల వరకు పాత అప్పన్నపేట గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ నగేష్ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి ఉత్తమ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు

హుజూర్‌నగర్ : నీతి నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకురాలు చావా కిరణ్మయి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు మంత్రి ఉత్తమ్‌పై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు.

అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

అనంతగిరి : ప్రతిఒక్క రైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త ఎం.గోపయ్య తెలిపారు. సోమవారం అనంతగిరి మండల పరిధిలోని కొత్తగూడెం, గోండ్రియాల, లక్కవరం, శాంతినగర్, మొగలాయికోట, కిష్టాపురం, పాలారం, చనుపల్లి, త్రిపురవరం, వసంతాపురం, వాయిలసింగారం గ్రామాల్లో ఆయన చేపట్టిన రైతు చైతన్య యాత్రలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారం పెరగాలంటే పశువుల పెంట, పచ్చి రొట్ట ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించాలని సూచించారు. చీడ, పీడల నివారణకు నీమాస్త్రం, వేప గింజల కషాయం, వేప ఆకుల ద్రావణం, వావిలాకు ద్రావణం, తూడికాడ ద్రావణం, ఆవు మూత్రం, పేడ ద్రావణం, పుల్లటి మజ్జిగ పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

లింగగిరిలో ప్రభుత్వ భూములు కబ్జా!



పల్లెప్రకృతి వనం స్థలాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి షేక్ సోనీలు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరిలో గల చిన్న చెరువు, పెద్దచెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతున్నట్లు పలువురు గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఆ చెరువుల్లోని మట్టినే చెరువుల శిఖం భూముల్లో పోసి ఆక్రమణకు పాల్పడుతున్నారని చెప్పారు. అదేవిధంగా గ్రామంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా గ్రామ శివారులోని మెగా బృహత్ పల్లె ప్రకృతి వనం స్థలంలో గ్రామానికి చెందిన కొందరు రైతులు రాత్రి సమయంలో ట్రాక్టర్లతో మట్టి పోసి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు ప్రభుత్వ భూములతో పాటు చెరువులను కాపాడాలని కోరారు. మెగా బృహత్ పల్లెప్రకృతి వనం కబ్జా విషయమై కార్యదర్శి షేక్ సోనీలును వివరణ కోరగా మెగా బృహత్ పల్లెప్రకృతి వనం స్థలాన్ని తాను పరిశీలించానని అది పల్లెప్రకృతి వనం భూమి కాదని, ఆ ప్రాంతంలో మట్టి ఎందుకు పోస్తున్నారని రైతులను ప్రశ్నించగా అది తమ భూమి అంటున్నారని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్



మోతె మండల కేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



చిలుకూరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న మహిళా ఓటర్లు



చిలుకూరులో పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్న సిబ్బంది

కోదాడ : నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం కోదాడ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలు, కోదాడ పట్టణంతో కలిపి 12,185 మంది ఓటర్లు ఉండగా వారిలో 8984 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 73.72గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, చింతా కవితారెడ్డి, బీజేపీ నాయకులు నూనె సులోచన, కనగాల వెంకట్రామయ్య తదితరులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ తీరును పరిశీలించారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఉదయం కోదాడలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఓటు వేసిన 9,737 మంది పట్టభద్రులు

హుజూర్‌నగర్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. నియోజకవర్గంలో 13,160 మంది పట్టభద్రులు ఉన్నారు. అందులో పురుషులు 8,975 మంది, మహిళలు 4,185 ఉన్నారు. ఏడు మండలాల్లో మొత్తం 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా పోలింగ్ ముగిసే సమయానికి 9,737 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 6,727 మంది, స్త్రీలు 3,010 మంది ఓటు వేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 73.99 శాతం పోలింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా పోలింగ్ సరళిని ఆయా పార్టీల నాయకులు పరిశీలించారు. పట్టభద్రులైన పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఏర్పాట్లు, కేంద్రాలను నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జున రెడ్డి పరిశీలించారు. సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పోలిగ్ కేంద్రాల వద్ద పోలీసులు భద్రతను పర్యవేక్షించారు.

పోలింగ్ సరళి తెలుసుకున్న జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో 3,448 మంది పట్టభద్రులకు గాను 7 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 2,601 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 1,677 మంది, స్త్రీలు 924 మంది ఓటు వేశారు. మొత్తం 75.43 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పట్టణంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళి గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు.

చింతలపాలెంలో..

చింతలపాలెం మండలంలో 75.60 శాతం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నమోదైంది. 791 పట్టభద్రులకు గాను 598 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 451 మంది పురుషులు, 147 మంది స్త్రీలు ఓటు వేశారు. 75.60 శాతం పోలింగ్ నమోదైంది.

నేరేడుచర్ల : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నేరేడుచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని మూడు పోలింగ్ బూత్‌లలో కేటాయించిన మొత్తం 2290 పట్టభద్రులకు గాను 1713 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 587 మంది మహిళలు, 1126 మంది పురుషులు ఓటు వేశారు. కాగా, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి నేరేడుచర్లలోని పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళి గురించి తెలుసుకున్నారు.

మునగాల : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌లో 74.80 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల సెక్టార్ అధికారి, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు సోమవారం తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 484, 485 పోలింగ్ కేంద్రాల్లో 2028 ఓట్లు ఉండగా 1517 మంది పట్టభద్రులు తమ ఓటు వేశారని తెలిపారు. వీరిలో 1073 మంది పురుషులు, 444 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా పోలింగ్ కేంద్రాలను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ సందర్శించినట్లు తెలిపారు. అదేవిధంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి మునగాలలో స్థానిక నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకన్న పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 486, 487 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1313 ఓటర్లకు గాను 996 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 75.85 శాతం పోలింగ్ నమోదు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా, ఎన్నికలను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, ఎన్నికల అధికారులు ఎస్‌డి.ఇమామ్, దుర్గాప్రసాద్, గోపాలకృష్ణ పర్యవేక్షించారు.

మోతె : మోతె మండల కేంద్రంలో సోమవారం నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1543 మంది ఓటర్లకు గాను 1098 మంది పట్టభద్రులు ఓటు వేశారు. 71 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

చిలుకూరు : చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాలుగు పోలింగ్ బూత్‌లలో మొత్తం 2207 ఓట్లు ఉండగా 1622 ఓట్లు పోల్ అయ్యాయి. 73.49 శాతం ఓట్లు నమోదు అయ్యాయి. కాగా, ఉదయం నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు బారులుదీరారు. నాలుగు గంటల తరువాత ఓటు వేసేందుకు వచ్చిన వారికి అనుమతి ఇవ్వలేదు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పోలింగ్‌ను పరిశీలించారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎస్‌ఐ నరేష్, ఆర్‌ఐలు మంత్రి ప్రగడ సీతయ్య, మంజుల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గల మూడు పోలింగ్ బూత్‌లలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 74.39 శాతం ఓట్లు నమోదైనట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. మొత్తం 2581 మంది ఓటర్లకు గాను 580 మంది మహిళలు, 1920 మంది పురుషులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. 74.39 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తును హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు పర్యవేక్షించారు. కాగా, పోలింగ్ కేంద్రాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సందర్శించి పోలింగ్ సరళి తెలుసుకున్నారు. రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారులు ఆర్‌ఐ రాము, సీనియర్ అసిస్టెంట్ తాబ్రేజ్ పాల్గొన్నారు.

అనంతగిరి : మండల కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచే పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరారు. మండల వ్యాప్తంగా 1310 మంది పట్టభద్రుల ఓట్లకు గాను 992 మంది ఓట్లు వేశారు. 75.72 శాతం పోలింగ్ జరిగింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎంపీడీఓ తుమ్మల నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఎస్‌ఐ నవీన్‌కుమార్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

పాలకవీడు : మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 879 ఓటర్లు ఉండగా 659 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి హుజూర్‌నగర్ పట్టణంలోని వీపీఎం పాఠశాలలోని 497వ బూత్‌లో సోమవారం తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలో సోమవారం జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌లో 70.76 శాతం ఓటింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా 1837 మంది ఓటర్లకు గాను రెండు పోలింగ్ బూత్‌లలో జరిగిన పోలింగ్‌లో 1300 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ మంగారాథోడ్ పరిశీలించారు. అదేవిధంగా ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నేరేడుచర్లలో బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో ఓటేసిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న



హుజూర్‌నగర్‌రూరల్ : సిరా గుర్తు చూపిస్తున్న జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కుటుంబ సభ్యులు



మఠంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీపీ పార్వతీకొండానాయక్



కోదాడలో ఓటు వేసిన టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కెఎల్‌ఎన్ ప్రసాద్



మునగాలలో సెక్టార్ అధికారిని పోలింగ్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ సూర్యనారాయణ



మఠంపల్లి మండల కేంద్రంలో పోలింగ్ సరళి పరిశీలిస్తున్న తహసీల్దార్ మంగారాథోడ్



నడిగూడెంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



కోదాడలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోదాడ పట్టణంలో పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ



హుజూర్‌నగర్‌లో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



గరిడేపల్లి : పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ చరమందరాజు



మునగాలలో పోలింగ్ సరళి గురించి బీఆర్‌ఎస్ నాయకులను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



పాలకవీడులోని పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



అనంతగిరిలో..



నేరేడుచర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు, యువతులు



గరిడేపల్లి : ఓటు వేసిన మాజీ ఎంపీపీ రంగనాథ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని మఠంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2006 నుంచి 2012 వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు సోమవారం హుజూర్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కాలం నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రిన్సిపాల్ అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తగ్గింపుపై ప్రభుత్వం స్పందించాలి

మిర్యాలగూడ టౌన్ : రిజర్వేషన్ల తగ్గింపుపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ సోమవారం బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓకు వినతిపత్రం అందజేశారు. గిరిజనుల 10శాతం రిజర్వేషన్ల అమలుపై కొంత మంది గ్రూప్–1 అభ్యర్థులు కోర్టుకు వెళ్లడంతో గిరిజనులకు న్యాయం చేయాలని కోర్టు సూచించినట్లు ఆ పత్రంలో వివరించారు. రిజర్వేషన్లు తగ్గిస్తే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ విత్తనాలపై జాగ్రత్త!

- దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు
- నాణ్యమైన, పేరున్న కంపెనీలవే కొనాలని అధికారుల సూచనలు
- నకిలీవి విక్రయిస్తే చర్యలు ఉంటాయని విక్రయదారులకు హెచ్చరికలు



కోదాడ పోలీస్ స్టేషన్‌లో విత్తన డీలర్లకు సూచనలు చేస్తున్న పోలీసులు, వ్యవసాయాధికారులు

కోదాడరూరల్ : వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. సాగులో నిమగ్నం అయ్యేందుకు రైతులు సైతం సిద్ధమవుతున్నారు. అయితే ప్రతి సీజన్‌లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి అనేకమంది రైతన్నలు నష్టపోతున్నారు. రైతన్నకు నకిలీ విత్తనాల బెడద లేకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నా ఏదో ఒక విధంగా మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వచ్చి రైతులు మోసపోతునే ఉన్నారు. దీంతో వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతులు దిగుబడి రాక నష్టపోతున్నారు. గ్రామాల్లో విత్తనాలు తక్కువ ధరకు వస్తున్నాయని రైతులు దళారుల మాయమాటలు నమ్మి కొనగోలు చేసి మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు. కాగా, కోదాడ డివిజన్‌లో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో లక్ష ఎకరాల్లో వరి, 18 వేల ఎకరాల్లో పత్తి, 6 వేల ఎకరాల్లో మిర్చి సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

అప్రమత్తమైన అధికారులు..

ఈ సీజన్ ప్రారంభానికి ముందే నకిలీ విత్తనాలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఏ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో నష్టపోకుండా ఉండేందుకు వ్యవసాయశాఖ, పోలీస్, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో విత్తన దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా డీలర్లు, దుకాణాల యజమానులకు సమావేశాలు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గ్రామాల్లో కొందరు ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా విత్తనాలు తెచ్చి విక్రయిస్తుంటారని ఈ విషయంలో కూడా రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెప్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



పత్తి సాగుకు దుక్కులు దున్నేందుకు సిద్ధం అవుతున్నాం. ఈ ఏడాది నాణ్యమైన, పేరున్న కంపెనీల విత్తనాలు కొనుగోలు చేస్తాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జంగిలి వీరబాబు, రైతు, కేఆర్‌పురం

దళారులను నమ్మొద్దు



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. నాణ్యమైన, పేరున్న కంపెనీల విత్తనాలను, అనుమతులున్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తి అయ్యేంత వరకు జాగ్రత్తగా దాచిపెట్టుకోవాలి.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ